సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

అష్టలక్ష్మి ఆలయంలో పూజలు నేడు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి ఆలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. తెల్లవారుజామున 4.30 గంటలకు సుప్రభాత సేవ, ఆరాధన, అనంతరం అష్టలక్ష్మి హోమం, 8.30 నుంచి విశేష సువర్ణ సంపంగిలతో పుష్పార్చన, ఉగాద పచ్చడి ప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి పంచాంగ శ్రవణం, దేవస్థాన విద్వాంసులతో సంగీత, నాట్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

తగరపువలస: సంగివలస వద్ద జాతీయ రహదారి దాటుతుండగా విజయనగరం జిల్లా సాలూరు కర్రి వీధికి చెందిన లారీ డ్రైవర్ కర్రి తిరుపతిరావుకు తీవ్ర గాయాలయ్యాయి. భీమిలి ఏఎస్ఐ రామం తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 19న తిరుపతిరావు మొక్కజొన్న లోడుతో సాలూరు నుంచి విశాఖ వైపు వస్తుండగా సంగివలస మూడు గుడుల వద్ద ఆగి దైవ దర్శనానికి రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో తగరపువలస నుంచి ఆనందపురం వైపు వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం తిరుపతిరావును ఢీకొని వెళ్లిపోయింది. ప్రమాదంలో డ్రైవర్ ఎడమకాలు విరిగిపోయింది. క్షతగాత్రుడిని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

పద్మనాభం: స్వాతంత్య్ర సమరయోదురాలు రూపాకుల విశాలాక్షి జయంతి సందర్భంగా మహిళల హక్కులు – చట్టాలపై మండలంలోని కురపల్లిలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పేద మహిళలకు దుప్పట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి బి.సత్య వెంకట హిమబిందు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు.

పోలమాంబకు వెండి కిరీటం సమర్పణ



స్థానికులు తీసుకొస్తున్న వెండి కిరీటం

కొమ్మాది: రుషికొండ బీచ్ వద్ద గల గ్రామ దేవత పోలమాంబ అమ్మవారికి వ్యాపారులు, కెమెరామెన్‌లు కలిసి సుమారు రూ.1.2 లక్షల విలువ చేసే వెండి కిరీటాన్ని బహూకరించారు. ముందుగా రుషికొండ బీచ్‌లో గంగమ్మ తల్లికి ఘటాలతో పసుపు, కుంకుమ సమర్పించారు. అక్కడి నుంచి పెద్దఎత్తున ఊరేగింపుగా వచ్చి పోలమాంబ అమ్మవారికి వెండి కిరీటాన్ని అలంకరించారు. కార్యక్రమంలో రామారావు, చెన్నాదాసు, చెన్నా ఎల్లయ్య, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది సంబరాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆనందపురం: మండలంలోని గుడిలోవ సరస్వతి విద్యా విహార్ పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం పాలవలస పంచాయతీ, మెట్ట మీదపాలెంలో ముందస్తు ఉగాది సంబరాలు నిర్వహించారు. ఉగాది విశిష్టతను తెలియజేస్తూ సంప్రదాయాలను వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం, శోభకృత నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రదర్శించిన నృత్య రూపకం అందరినీ ఆకట్టుకుంది. సర్పంచ్ నాగోతు అచ్చియ్యమ్మ, తమ్మిన నరిసింగరావు, ఎం.నరిసింగరావు, డాక్టర్ పద్మ పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా! లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!

సంప్రదించవలసిన నెంబరు

భీమిలి

9666125299, 9912440606

విద్యార్థులకు మేనమామ సీఎం జగన్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



రాగి జావ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కొండబాబు



రేఖవానిపాలెం యూపీ పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం



విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విద్యార్థులకు రాగి జావ అందజేస్తున్న వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను తదితరులు



లక్ష్మీపురం పాఠశాలలో రాగిజావ పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ బంగారునాయుడు



రాయపాలెం హైస్కూల్‌లో రాగిజావ పంపిణీ కార్యక్రమంలో శిల్లా కరుణాకరరెడ్డి, చిల్ల భాస్కరరెడ్డి

మధురవాడ: సమాజంలోని పేద పిల్లలకు నాణ్యమైన విద్య, దుస్తులతోపాటు పౌష్టికాహారం అందిస్తూ సొంత మేనమామలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూసుకుంటున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరు ముద్దలో భాగంగా రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యారంగం కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. దురదృష్టవశాత్తు కొందరు ప్రతీదీ రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. చిన్నపాటి వర్షం కురిసినా బురదమయం అవుతున్న పాఠశాల మైదానాన్ని ఎత్తు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎమ్.రాజబాబు, జయప్రద, శ్రావణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బుడుమూరి మీనా, పిళ్లా సూరిబాబు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, పిళ్లా సత్యనారాయణ, పిళ్లా రమణ, సంజీవ్, వాండ్రాసి సూరి అప్పారావు పాల్గొన్నారు.

● జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీ సునీల్‌శర్మ కాలనీలోని జెడ్పీ హైస్కూలు, ఎంపీపీ స్కూళ్లలో పిల్లలకు రాగి జావ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందిస్తున్న ఘనత జగన్‌దే

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని భీమిలి అర్బన్, రూరల్ వైఎస్సార్‌సీపీ నాయకులు కొనియాడారు. టీడీపీ హయాంలో పప్పు, కూరగాయలు లేని నీళ్ల చారు, పురుగులతో కూడిన అన్నం తినలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 15 రకాల ఆహార పదార్థాలు మార్చిమార్చి వడ్డిస్తున్నారన్నారు. దీంతో పిల్లలు ఇష్టంగా తింటూ ఆరోగ్యంగా చదువుకుంటున్నారన్నారు.

● చిట్టివలస జెడ్పీ హైస్కూల్, బాలికల హైస్కూల్‌లో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, ప్రధానోపాధ్యాయులు పొట్నూరు మురళీమోహనరావు, సీహెచ్ రోజామణి రాగి జావ పంపిణీ చేశారు. రాయపాలెం జీవీఎంసీ హైస్కూల్‌లో శిల్లా కరుణాకరరెడ్డి, 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్, పీతల వెంకట అప్పారావు, ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి రాగి జావ పంపిణీని ప్రారంభించారు. సంతపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిప్పాడ వెంకటేష్, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, కంచుబోయిన వెంకటరావు, మద్ది మహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు బ్రాహ్మణి రాగిజావ పంపిణీ చేశారు.

● భీమిలి మండలం లక్ష్మీపురంలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, ఇన్‌చార్జి సర్పంచ్ బమ్మిడి అప్పన్న, కనకల వెంకటరమణ, శింగనబంద పంచాయితీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకట నారాయణ, గుడ్డాల ఎల్లయ్య, రేఖవానిపాలెం పంచాయితీలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పీతల గంగ శ్రీను, నాయకులు ఎం.మహేష్‌వర్మ, మల్లేటి హరి శంకర్ తదితరులు రాగిజావ పంపిణీ చేశారు.

కొమ్మాది: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తోందని 4వ వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు అన్నారు. కాపులుప్పాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రాగి జావను విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, ఎరుసు అప్పలకొండరెడ్డి, పాల నాయుడు, దేవాడ నాయుడు, సాడి రమణ, వరహాలు, బోర అప్పలరెడ్డి, దుంప సత్యం పాల్గొన్నారు.

ఆనందపురం: ఎదిగే పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న గోరుముద్దను అమలు పరుస్తున్నారని వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను చెప్పారు. మండలంలోని గిడిజాల ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సర్పంచ్ షిణగం అప్పలరాజు, హెచ్ఎం ఎల్ఎస్ఎస్ పాత్రుడు, కోరాడ ముసలినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మనాభం: విద్యార్థులు మరింత ఆరోగ్యంగా ఉండేందుకే తమ ప్రభుత్వం జగనన్న గోరు ముద్దలో భాగంగా రాగి జావ పంపిణీకి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు అన్నారు. గంధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగి మాల్టు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ జి.వి.కె.కె.వర్మ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.రాధ, ఇన్‌చార్జి ఎంఈవో ఎం.శివరాణి, పల్లి గోవింద పాల్గొన్నారు.

● రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 330 మందికి జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు రాగి జావ తాగేందుకు గ్లాసులు వితరణగా ఇచ్చారు. పాఠశాల హెచ్ఎం వి.శంకరరావు పాల్గొన్నారు.

భీమునిపట్నం: స్థానిక సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాగి జావను వైఎస్సార్‌సీపీ మూడో వార్డు ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు అందించారు. సెయింట్ ఆన్స్ కో ఆర్డినేటర్ రెవరెండ్ సిస్టర్ థెరిస్సా, ప్రధానోపాధ్యాయురాలు పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

70 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు హెల్త్‌కార్డులు, మెడికల్ కిట్లు అందిస్తున్న దివీస్ సిబ్బంది

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ గొల్లల పాలెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో 70 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి హెల్త్‌కార్డులు పంపిణీ చేశారు. శిబిరాన్ని సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి ప్రారంభించగా దివీస్ లేబొరేటరీ ప్రతినిధులు మందులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, సిబ్బంది నాగేశ్వరరావు, రమణకుమారి, దివీస్ ప్రతినిధులు ఇ.ఎస్.నాగరాజు, నరసింహారావు, ప్రధానోపాధ్యాయుడు కలమట గోవిందరావు, సౌదామిని పాల్గొన్నారు.

● గుడివాడ పంచాయతీ ప్రాథమిక పాఠశాలలో పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యుడు తిరుపతి స్వామి ఆధ్వర్యంలో 120 మంది చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ చిల్ల జమున శిబిరాన్ని ప్రారంభించారు.

నోటి ఆరోగ్యంపై అవగాహన అవసరం



అంబేడ్కర్ కూడలిలో ప్రదర్శనలో ఆరోగ్య సిబ్బంది

తగరపువలస: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమిలి సీహెచ్‌సీ దంత వైద్యుడు డి.సిద్ధార్థ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. దంత కళాశాల వైద్యులు శివకుమార్, యశ్వంత్ సాయి, వరప్రసాద్ తదితరులు నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సుష్మిత, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలపై ర్యాలీ

ఆనందపురం: మానసిక రుగ్మతలు ఉన్న వారికి తోడ్పాటు అందించి సహకరించాలని సహిత ఉపాధ్యాయుడు కలమట శ్రీనివాసరావు సూచించారు. ఆనందపురంలో గల భవిత విద్యా కేంద్రంలో మంగళవారం డౌన్ సింట్రోమ్ దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం ఎ.అంజనా కుమారి, సహిత విద్య ఉపాధ్యాయురాలు ఐ.నాగమణి పాల్గొన్నారు.

ఘనంగా నూకాలమ్మ ఉత్సవాలు



ఆకట్టుకున్న వేషధారణ

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి పలు రకాల నేల వేషాలు, సాముగ రిడీలు, పులివేషాలు ప్రదర్శించారు. అలాగే గంట స్తంభం వేదిక ఎదురుగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చే కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి కీర్తి శ్రీనివాసరావు భక్తులకు సదుపాయాలు కల్పించారు. అమ్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కదిరి జగన్నాథం బ్రదర్స్ భక్తులకు పులిహోర ప్రసాదాన్ని అందించారు. మరోవైపు సాయంత్రం నాలుగు గంటల నుంచి వర్షం కురుస్తుండడంతో కొంచెం ఇబ్బంది పడుతున్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. ఈ సందర్భంగా డ్యాన్సులు చేసి ఆకట్టుకున్నారు. ముందుగా ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని సూచించారు. హెచ్ఎం వి.శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎన్‌డీఆర్‌సీ సీనియర్ మేనేజర్ బిజయ్ కుమార్ సాహు



బహుమతులు అందజేస్తున్న బిజయ్ కుమార్ సాహు

మధురవాడ: మహిళలు ఎక్కడ గౌరవం పొందుతారో అక్కడ దేవతలు పూజలందుకుంటారని ఎన్‌డీఆర్‌సీ సీనియర్ మేనేజర్ డాక్టర్ బిజయ్ కుమార్ సాహు అన్నారు. మంగళవారం సాయంత్రం మధురవాడ గాయత్రి విద్యా పరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం బిజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించి, రాణించాలని సూచించారు. ప్రస్తుతం టెక్నాలజీ అందుబాటులో ఉన్నందున జాబ్ క్రియేటర్స్‌గా మారాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. గాయత్రి విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు ఆచార్య కేపీఆర్ శాస్త్రి, ప్రిన్సిపాల్ ఆర్‌కే గోస్వామి తదితరులు పాల్గొన్నారు.

జోరు వానతో రోడ్లు జలమయం



నీట మునిగిన మధురవాడ డైలీ మార్కెట్ రోడ్డు



మధురవాడ సర్వీసు రోడ్డులో నీట మునిగిన ద్విచక్ర వాహనం

మధురవాడ: పగలంతా వాతావరణం సాధారణంగా ఉన్నప్పటికీ మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వర్షం దంచి కొట్టింది. మధురవాడ పరిసర ప్రాంతాల్లో జోరుగా వర్షం కురువడంతో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. మధురవాడ అప్ బ్రిడ్జి, డైలీ మార్కెట్, పీహెచ్‌సీ, ఆర్‌జేడీ విద్యా శాఖ కార్యాలయానికి వెళ్లే రోడ్డు, రేవళ్లపాలెం రోడ్డు, జాతీయ రహదారి నుంచి శివశక్తినగర్‌కి వెళ్లే రోడ్లు చెరువులను తలపించాయి. దీంతో పలువురు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనాలు నీట మునిగిపోయి మధ్యలో ఆగిపోవడంతో తోసుకుని బయటకు వచ్చారు. మహిళలు మరిన్ని ఇబ్బందులు పడ్డారు.



మధురవాడ సర్వీసు రోడ్డులో అప్ బ్రిడ్జి వద్ద వాహనదారుల అవస్థలు

ఆర్థిక సమస్యలతో ల్యాబ్ టెక్నీషియన్ అదృశ్యం



కర్రి సంతోష్‌రెడ్డి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు సంతపేటకు చెందిన కర్రి సంతోష్‌రెడ్డి (35) అనే వ్యక్తి ఈ నెల 18న ఉదయం 5 గంటలకు ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అదే సమయంలో పుట్టింట్లో ఉన్న భార్యకు ఫోన్ చేసి తనకు ఆర్థిక సమస్యలు ఉన్నట్టు తెలిపినట్టు అతని తండ్రి వెంకటరెడ్డి భీమిలి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఐటీ పూర్తి చేసిన సంతోష్‌రెడ్డి ఆనందపురం మండలం కొంత్యాంలోని ఎన్ఎస్ఆర్ ఐటీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తిస్తుంటాడు. భీమిలి పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సత్తిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరు మృతి



ప్రమాద స్థలిలో గాయాలతో శ్రీనివాసరావు

తగరపువలస: స్థానిక గోస్తనీ నది వంతెనపై సోమవారం మధ్యాహ్నం ప్రమాదానికి గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఎర్నింటి శ్రీనివాసరావు(38), బుగత సూరిబాబు(46) మంగళవారం వేకువజామున మృతి చెందారు. భీమిలి ఎస్ఐ గంటా హరీష్ తెలిపిన వివరాల ప్రకారం... ఆరిలోవ బాలాజీనగర్ వివేకానంద కాలనీ, వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంతానికి చెందిన ఎర్నింటి శ్రీనివాసరావు, బుగత సూరిబాబు ఈ నెల 20న ఉదయం ద్విచక్ర వాహనంపై విజయనగరం వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం 3.45 గంటల సమయంలో తగరపువలస సమీపంలోని వెంకటేశ్వరమెట్ట కూడలికి చేరుకున్నారు. అకస్మాత్తుగా అక్కడ యూ టర్న్ తీసుకుని రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా విజయనగరం వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే వారికి సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందారు. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడో విడత ఆసరా రూ.10.99 కోట్లు

పద్మనాభం: మండలంలోని 1,186 స్వయం సహాయక సంఘాలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా రూ.10.99 కోట్లు మంజూరైనట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ప్రభాకర్ తెలిపారు. గ్రామాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు దీనిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 25న రాష్ట్ర స్థాయిలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిధులు విడుదల చేస్తారన్నారు. ఆసరా సొమ్ముకుతోడు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి సభ్యుల జీవనోపాధి పెంపొందించుటకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

జీవీఎంసీ ఆస్తుల లీజుకు 4న వేలం

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 పరిధిలో ఖాళీగా ఉన్న షాపు రూములు, కల్యాణ మండపాలు, భవనాలు, ముడసర్లోవ పార్కులు, ముడసర్లోవ, మిథిలాపురి వుడా కాలనీల్లో చెట్ల ఫలసాయం, మార్కెట్‌లు, రోడ్ మార్జిన్‌లు వంటివి లీజుకు ఇవ్వడానికి ఏప్రిల్ 4న వేలం వేయనున్నట్లు జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు నిబంధనలకు లోబడి వేలం పాటలో పాల్గొనవచ్చని, మరిన్ని వివరాలకు జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య



మీసాల సత్యవతి (ఫైల్)

ఆనందపురం: మండల కేంద్రమైన ఆనందపురంలో భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ రామచంద్రరావు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాలవలస గ్రామానికి చెందిన సత్యవతికి ఆనందపురం గ్రామానికి చెందిన మీసాల సత్యంతో 2006లో వివాహమైంది. వారికి పది, ఏడు తరగతులు చదువుతున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా భర్త సత్యం వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ భార్యను వేధించేవాడు. ఇలా పలుమార్లు గొడవలు జరిగిన అనంతరం సత్యవతి 2018లో భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో సత్యవతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి సత్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సీఐ రామచంద్రరావు, ఎస్ఐ నరసింహమూర్తి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. భర్త వేధింపుల వల్లే సత్యవతి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆమె తల్లి సత్యం పోలీసులకు వివరించింది. ఈ మేరకు భర్త మీసాల సత్యంపై కేసు నమోదు చేశారు. మృతదేహానికి భీమిలి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



